
సాక్షి పల్నాడు

బుధవారం । 24 । జూలై । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు.



ఈవీఎం గోడౌన్ల తనిఖీ

ఫిరంగిపురం: రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎంలు భద్రపరచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడ మాచవరానికి చెందిన ఎం.శ్రీయన్ కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది.

నాటి పరుగు.. సాగేనా అడుగు

జిల్లా సమస్యలు, ఆకాంక్షలను ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించాలంటున్న ప్రజలు

- గత ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు పోరాడాలని పిలుపు
- వరికపూడిసెల, నాలుగు జాతీయ రహదారులను త్వరగా పూర్తి చేయాలని విన్నపం
- పిడుగురాళ్ల మెడికల్ కళాశాలలో వచ్చే ఏడాది నుంచి తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి
- తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం దిశగా గత ప్రభుత్వం చర్యలు కొనసాగించడం అవసరం
- క్యాబినెట్‌లో పల్నాడుకు చోటు లేనందున అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ చూపాలంటున్న జిల్లా వాసులు



• పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లిలో మెడికల్ కళాశాల, అనుబంధ వైద్యశాలను మాజీ సీఎం వైఎస్ జగన్ మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో నిర్మాణం పూర్తయి వైద్య కళాశాలలో కొన్ని విభాగాలు ప్రారభించారు. మిగిలిన బ్లాక్‌లను త్వరితగతిన పూర్తి చేసి వచ్చే ఏడాది నుంచి వైద్య విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పూర్తి స్థాయిలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా సమస్యలు, ఆకాంక్షలను స్థానిక ఎమ్మెల్యేలు అసెంబ్లీ వేదికగా ప్రస్తావించాలని ప్రజలు కోరుకుంటున్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి అందరూ టీడీపీ నేతలే ఎమ్మెల్యేగా గెలుపొందారు. శాసనసభ్యులు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంతో పోరాడి కొత్త పనులు, నిధులు సాధించాలని జిల్లా వాసులు కోరుకుంటున్నారు. గత ప్రభుత్వం ఎంతో కీలకమైన ప్రాజెక్టులను ప్రారంభించి పనులుచేపట్టింది. వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సి ఉంది.

రహదారులు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాలోని నాలుగు కీలకమైన వాడరేవు–నకరికల్లు, పేరేచర్ల - కొండమోడు, సాగర్ - దావుపల్లి, మాచర్ల - దాచేపల్లి రహదారులను కేంద్ర రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ద్వారా జాతీయ రహదారులుగా గుర్తింపజేసి నిర్మాణాలు ప్రారంభించి, కొనసాగించింది. ఈ రహదారులు పూర్తయితే తెలంగాణకు, రాయలసీమకు మధ్య పల్నాడు వారధిగా మారి వాటి మధ్య దూరం, సమయం తగ్గనుంది.



- గత ప్రభుత్వంలో జిల్లాలో వైద్య, విద్య రంగాలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. బడులు, ఆసుపత్రులు నాడు-నేడు ద్వారా దశల వారీగా రూపురేఖలు మార్చారు. మిగిలిన వాటిని ఆధునికీకరించి అందుబాటులోకి తేవాల్సి ఉంది.
- నరసరావుపేట మండలంలోని పెద్ద తురకపాలెం సమీపంలో ఆటోనగర్ ఏర్పాటు చేయాలని భావించి గత మార్చిలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. దీనికి సుమారు 17 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. మరో 15 ఎకరాలు ప్రైవేట్ భూమిని కొనుగోలు చేయాలని ఆలోచన చేశారు. దీన్ని ప్రస్తుత ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.



- రొంపిచర్ల మండలంలో వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. దీనికి భూ కేటాయింపులు జరిగాయి. ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేసి అందుబాటులోకి తేవాల్సి ఉంది.
- రొంపిచర్లలో కేంద్రీయ విద్యాలయం పనులు మొదలుపెట్టాల్సిన అవసరం ఉంది.
- నరసరావుపేటలో మరో ఫ్లై ఓవర్ నిర్మాణం
- నరసరావుపేట పట్టణం విలీన గ్రామాలవారికి తాగునీరు అందజేసేందుకు మరో స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు



- పెదకూరపాడు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించాల్సి ఉంది.
- నరసరావుపేట నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో ఉన్న డంపింగ్ యార్డును తురకపాలెం శివారులోకి మార్చి, డంపింగ్ యార్డు 12 ఎకరాల స్థలంలో పార్కు నిర్మాణం చేయాల్సి ఉంది.
- సత్తెనపల్లిలోని నరసరావుపేటరోడ్డులో ఎకరం స్థలంలో, మాచర్ల రోడ్డులోని మూడు ఎకరాల స్థలంలో ఉన్న డంపింగ్ యార్డులను మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవ తీసుకొని ఖాళీ చేయించారు. నరసరావుపేట రోడ్‌లో ఎకరం స్థలంలో అందమైన పార్కు నిర్మించాలని యోచించారు ప్రస్తుతం స్థలం ఖాళీగా ఉంది. మాచర్ల రోడ్డులోని మూడు ఎకరాల్లో చెత్త తెలగింపు పూర్తిగా చేసి పార్కు నిర్మాణం చేపట్టాలి.
- పేరేచర్ల- కొండమోడు వరకు 49.91 కిలోమీటర్లు రహదారి విస్తరించనున్నారు. దీనికిగాను నాలుగు మండలాల్లో 464.28 ఎకరాల భూ సేకరణ జరిగింది. మొత్తం మూడు బైపాసులు నిర్మించాల్సి ఉంది. టెండరింగ్ పూర్తయినా పనులు ప్రారంభం కాలేదు.



- మాదిపాడు బ్రిడ్జి పూర్తి చేసి పెదకూరపాడు నియోజకవర్గంలోని గ్రామాలకు రాకపోకల సౌకర్యం పెంచాలి.
- గురజాల, దాచేపల్లి, మాచవరం మండలాల్లో ప్రభుత్వ ఇంటర్మీడియెట్ కళాశాలలతో పాటు డిగ్రీ కళాశాల ఏర్పాటు.
- మాచర్లలో 100 పడకల ఆసుపత్రిని గత ప్రభుత్వం మంజూరు చేసింది. దాన్ని పూర్తి చేయాల్సి ఉంది.



పర్యాటకం..



నాగార్జున సాగర్ వద్ద 100 ఎకరాలలో ఏపీటీ టూరిజం ఆధ్వర్యంలో టూరిజం పార్క్ ఏర్పాటు చేయవచ్చు. సాగర్ సమీపంలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. అది కార్యరూపం దాల్చితే పర్యాటకంగా మరింత ఉపయోగకరంగా ఉంటుంది. కోటప్పకొండ, కొండవీడులో గత ప్రభుత్వం హయాంలో ఎంతో అభివృద్ధి జరిగింది. దాన్ని కొనసాగించాల్సి ఉంది.

వరికపూడిసెల



వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మించే ప్రాంతం

పల్నాడు ప్రజల ఏడు దశాబ్దాల కల అయిన వరికపూడిసెల ప్రాజెక్టు పనులను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అందుకు అవసరమైన అటవీ, పర్యావరణ, వన్యమృగ రక్షణ అనుమతులను సాధించారు. మొదటి దశ పనులు చురుగ్గా జరుగుతున్న సమయంలో ప్రభుత్వం మారింది. ఈ ప్రాజెక్టు పనులను కొత్త ప్రభుత్వం కొనసాగించాల్సి ఉంది. అందుకోసం మాచర్ల, వినుకొండ ఎమ్మెల్యేలు అసెంబ్లీ వేదికగా ఒత్తిడి తేవాల్సి ఉంది. ఈ పథకం పూర్తయితే 1.25 లక్షఎకరాలకు సాగునీటితోపాటు, లక్ష మందికి తాగునీరు కూడా అందుబాటులోకి వస్తుంది.

న్యూస్‌రీల్

పేరంటాళ్లమ్మ దేవాలయంలో చోరీ

శావల్యాపురం: మండలంలోని శానంపూడి శివారు గ్రామమైన బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ చల్లా సురేష్ తెలిపిన వివరాలు మేరకు అమ్మవారి దేవాలయం తలుపులు తాళాలు పగలికొట్టి రెండు హుండీలు, బీరువాను బద్దలుకొట్టి సీసీ కెమెరాలు, హార్డు డిస్క్, చీరలు తదితర విలువైన సామగ్రి, నగదు చోరీ చేసినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్, ఎస్ఐ చల్లా సురేష్ పోలీసులు సందర్శించి ఆధారాలు సేకరించారు. ట్రస్టు చైర్మన్ సోమేపల్లి వీరాంజినేయులు, దేవదాయ అధికారి పుణ్యాల వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గిరి ప్రదక్షిణ యాత్రకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

సత్తెనపల్లి: పట్టణం నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు ఈ నెల 27న ఆర్టీసీ బస్సు బయలు దేరుతుందని డీఎం జీఎస్వీ విజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 28న ఉదయం శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అరుణా చలం బయలుదేరుతుందన్నారు. ఈ నెల 29న పౌర్ణమి రోజున గుడి ప్రదక్షిణ చేసుకుని తిరుగు ప్రయాణంలో కంచి కూడా చూసుకుని 30న తిరిగి సత్తెనపల్లి చేరుతుందన్నారు. సూపర్‌లగ్జరీ పుష్ బ్యాక్ 2+2 రాను పోను ఒకరికి రూ.2,500గా టికెట్ చార్జీ నిర్ణయించామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9959225429, 7382896966, 7382895691 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆక్వా పార్కుకు భూమి పరిశీలన



నిజాంపట్నం: ఆక్వా రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం ఆక్వా పార్కును ఏర్పాటు చేస్తుందని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. మండలంలోని దిండి ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఆక్వా పార్కుకు అవసరమైన భూమిని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 300 ఎకరాలు సేకరించడం జరుగుతుందని చెప్పారు. అందులో 50 ఎకరాలు పర్యాటక శాఖకు, 50 ఎకరాలు రిజర్వ్ ఫారెస్ట్ కింద అటవీశాఖకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. సుమారు 190 ఎకరాల్లో ఆక్వా పార్కు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆయన వెంట రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్ ఉన్నారు.

శాకంబరీగా దుర్గమ్మ



కొలివరం (తెనాలి): కొలివరం బీసీ కాలనీలోని శ్రీదుర్గా మల్లేశ్వరి దేవస్థానంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి మంగళవారం శాకంబరీ అలంకారం చేశారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త జాజుల వెంకటేశ్వరరావు, దక్షిరాజు మణికంఠవర్మ, జగదీష్ పర్యవేక్షించారు.

బోధనలో సృజనాత్మకత ఉండాలి

బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష అధికారి సుధాకర్

వేటపాలెం: బోధనలో సృజనాత్మకత ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష అధికారి ఎంపీ సుధాకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దేశాయిపేట, పాపాయిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలవుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను మంగళవారం పరిశీలించారు. సుధాకర్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యలో పునాది అభ్యసనానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి అభ్యసనాన్ని పరిశీలించారు. ఆకర్షణీయమైన బోధనాభ్యసన సామగ్రి తయారు చేసి ఉపాధ్యాయులు తరగతి బోధనలో సృజనాత్మకంగా ఉండాలని అన్నారు. పునాది అభ్యసనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల ప్రాంగణలో మొక్కలు నాటించారు. పిల్లలతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి సుబ్బయ్య, ఐ పురుషోత్తమరావు, సీఆర్పీ బి.సుజాత పాల్గొన్నారు.

టీడీపీ హత్యోన్మాదం



గుంటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈదా సాంబిరెడ్డిని అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, రోధిస్తున్న ఈదా సాంబిరెడ్డి భార్య

- పల్నాడులో ఆగని రాక్షస కాండ
- వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఈదా సాంబిరెడ్డిపై హత్యాయత్నం
- రాడ్లు, కర్రలతో దాడికి తెగబడిన దుండగులు
- దాడి సమయంలో పెదకూరపాడు నియోజకవర్గంలోనే ఎస్పీ శ్రీనివాసరావు

సాక్షి, నరసరావుపేట/నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పల్నాడులో టీడీపీ రాక్షసకాండ కొనసాగుతోంది. ఎన్నికలైనప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా అధికారపక్షం సాగిస్తున్న మారణహోమం చల్లారడం లేదు. తెలుగుదేశం గూండాల రక్తదాహం తీరడం లేదు. గతవారం వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్ హత్యోదంతాన్ని మరువక ముందే మరో హత్యాయత్నానికి టీడీపీ నేతలు తెగబడ్డారు. మంగళవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ కీలకనేత, క్రోసూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ ఈదా సాంబిరెడ్డిపై రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఫలితంగా పల్నాడులో మళ్లీ హైటెన్షన్ నెలకొంది. గుంటూరు నుంచి తన స్వగ్రామమైన 75 త్యాళ్లూరుకు వస్తున్న సమయంలో సాంబిరెడ్డిపై టీడీపీ రౌడీలు హత్యాయత్నం చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సాంబిరెడ్డితోపాటు కారులో ఉన్న పార్టీ నాయకులు గంగాధరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కారు డ్రైవర్ దామోదరరెడ్డి కూడా గాయపడ్డారు. ఓ వైపు టీడీపీ రాక్షస కాండను నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో ఆందోళనకు సిద్ధమవుతున్న తరుణంలోనే టీడీపీ నేతలు సాంబిరెడ్డిపై హత్యాయత్నం చేయడం గమనార్హం.

ఎస్పీ పర్యటన సమయంలోనే..

కొత్తగా పల్నాడు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కంచి శ్రీనివాసరావు మంగళవారం సత్తెనపల్లి, రాజుపాలెం, బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరులలో పర్యటించారు. వైఎస్సార్ సీపీ నేత ఈదా సాంబిరెడ్డిపై టీడీపీ గూండాలు దాడి చేస్తున్న సమయంలో ఎస్పీ పెదకూరపాడు నియోజకవర్గంలోనే పర్యటిస్తుండడం గమనార్హం.

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

అమరావతి: సాంబిరెడ్డిపై హత్యాయత్నం జరిగిన ఘటనాస్థలాన్ని పల్నాడు ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం రాత్రి పరిశీలించారు. ధ్వంసమైన కారును చూసి ఘటన వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. నిందితులను పట్టుకోవడానికి డాగ్ స్క్వాడ్‌ను రప్పించాలని, ఆధారాల సేకరణకు క్లూస్ టీంను ఏర్పాటు చేయాలని, పోలీసు అధికారులతో ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి త్వరగా నిందితులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. ఆయనవెంట అమరావతి సీఐ బ్రహ్మం, పెదకూరపాడు ఎస్ఐ వెంకటరావు ఉన్నారు.



దుండగులు దాడి చేసిన కారు ఇదే

దాడులు మంచి పద్ధతి కాదు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి వివాదాలకు వెళ్లే వ్యక్తి కాదని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు సాంబిరెడ్డిపై మంగళవారం సాయంత్రం జరిగిన హత్యాయత్నాన్ని నంబూరు ఖండించారు. దాడి ఘటన గురించి తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే ఆస్పత్రికి చేరుకుని సాంబిరెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ఘటనలో సాంబిరెడ్డి వెంట ఉన్న కె.గంగాధర్‌రెడ్డి, దామోదరరెడ్డి, కల్లి శ్రీనివాసరెడ్డిలతో మాట్లాడారు. ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సాంబిరెడ్డిపై పథకం ప్రకారమే దాడి జరిగిందని పేర్కొన్నారు. కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయని వివరించారు. దాడులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి విషసంస్కృతి లేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ దాడులను ప్రోత్సహిస్తోందని, గ్రామాల్లో నాయకులు ఉండలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. ఘటన గురించి ఎస్పీ, డీఎస్పీ, సీఐల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. నిందితులను వెంటనే గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వర్గీయుల పనే!



గాయపడిన దామోదర రెడ్డి

ప్రతిపక్ష వైఎస్సార్ సీపీని నిర్వీర్యం చేసేందుకు టీడీపీ కుయుక్తులు పన్నుతోంది. దాడులతో మారణహోమం సృష్టించి వైఎస్సార్ సీపీ నాయకులను భయపెట్టి పార్టీ కార్యక్రమాలకు దూరం చేయాలని కుట్రపన్నుతోంది. దీనిలో భాగంగానే హత్యాసంస్కృతిని ప్రోత్సహిస్తోంది. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వర్గీయులే ఈదా సాంబిరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడినట్టు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును గుంటూరులోని పార్టీ కార్యాలయంలో కలిసి వస్తుండగా పక్కా పథకం ప్రకారం దాడి చేసి సాంబిరెడ్డిని అంతమొందించాలని యత్నించారు. అమరావతి మండలం ఉంగుటూరు, పెదకూరపాడు మండలం కంభంపాడు గ్రామాల మధ్య బ్రిడ్జి దాటిన తరువాత ఆంజినేయస్వామి దేవాలయం వద్ద మాటు వేసి దాడి చేశారు. పది మందికిపైగా దుండగులు సాంబిరెడ్డి, ఆయనతోపాటు ఉన్న నాయకులు కీసర గంగాధర్‌రెడ్డి, కల్లి శ్రీనివాసరెడ్డి, కారు డ్రైవర్ దామోదర్‌రెడ్డిలపై విచక్షణారహితంగా మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. పోలింగ్ రోజు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ భార్య లావణ్య 75 తాళ్లూరు పోలింగ్ కేంద్రంలో దౌర్జన్యానికి పాల్పడుతుండగా ఈదా సాంబిరెడ్డి అడ్డుకున్నారన్న కక్షతోనే భాష్యం ప్రవీణ్ దాడి చేయించారని క్షతగాత్రుడు కల్లి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు.

సాంబిరెడ్డిపై జరిగిన హత్యాయత్నం గురించి తెలిసి కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు.

రాడ్లు, కర్రలతో దాడి



"గుంటూరు ఆర్టీఓ కార్యాలయం దగ్గర్లోని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయం నుంచి కారులో బయలుదేరాం. ఉంగుటూరు బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి మా కారును మరో కారుతో అడ్డగించారు. పదిమంది వరకు దిగి మా వాహనం తలుపులు తీయాలని కేకలు వేశారు. అంతలోనే కర్రలు, ఇనుపరాడ్లతో కారు అద్దాలను ధ్వంసం చేశారు. కారులో ముందు కూర్చున్న సాంబిరెడ్డిని కిందకు దించి, ఆమడ దూరం తీసుకెళ్లి విచక్షణారహితంగా దాడి చేశారు. కేకలు వేస్తున్నా.. వదల్లేదు. నా వీపుపైనా చితకబాదారు.

– కె.గంగాధర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు

సర్జికల్ మాస్క్‌లు ధరించారు



నిందితులు కొందరు సర్జికల్ మాస్కులు ధరించారు. వారి వయసు 35 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటాయి. సుమారు పది మంది వెంట తెచ్చుకున్న మారణాయుధాలతో దాడిచేశారు. కారు అద్దాలు పగలగొట్టారు.

– కె.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు

పాతూరులో డెంగీ కేసు నమోదు



పాతూరులో పర్యటించిన మున్సిపల్ కమిషనర్, జిల్లా మలేరియా అధికారి

నరసరావుపేట: స్థానిక 28వ వార్డు పాతూరు శివాలయం పరిసరాల్లో పదేళ్ల బాలుడికి డెంగీ జ్వరం రావటంతో మున్సిపల్, ఆరోగ్యశాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. మురుగు కాలువల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ మూడు రోజులు క్రితం డెంగీ వచ్చిన బాలుడు ఆరోగ్యంగానే ఉన్నాడని, చుట్టుపక్కల ఉన్న 60 ఇళ్లకు సంబంధించి ప్రజలకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియచెప్పామన్నారు. డెంగీ దోమ మంచినీటిలోనే పెరుగుతుందని, ఆ దోమల నిర్మూలనపై పురపాలక సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలు, అధికారులకు సూచించామన్నారు. వచ్చేవారం నుంచి మంగళవారం, శుక్రవారాల్లో వారానికి రెండురోజులు డ్రైడే పాటిస్తామని చెప్పారు. మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ ఓలేటి శ్రీనివాసరావు, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టరు రామకోటయ్య, మెడికల్ ఆఫీసర్లు, వార్డు సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

తీరప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ



అచ్చంపేట: కృష్ణానది తీరప్రాంతమైన పులిచింతల ప్రాజెక్టు, మాదిపాడులోని చెక్‌పోస్ట్, బల్లకట్టు, స్థానిక పోలీస్ స్టేషన్‌లను పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. చెక్‌పోస్టు, పులిచింతల ప్రాజెక్టు వద్ద అమర్చిన సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. ఎస్పీ ఆకస్మిక పర్యటనకు వచ్చిన సమయంలో సీఐ, ఎస్ఐలు స్టేషన్‌లో లేరు. మండలంలో సమస్యాత్మక గ్రామాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌మొత్తం కలయతిరిగి, పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

క్లుప్తంగా

శాంతిభద్రతల సమస్యలు తలెత్తకూడదు

పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు



సత్తెనపల్లి: శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ, రాజుపాలెం, సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లిలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి శాంతి భద్రతల సమస్య తలెత్తకూడదన్నారు. ముఖ్యంగా పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు అల్లర్లు వంటివి జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. చిరునవ్వుతో బాధితుల ఫిర్యాదులను స్వీకరించి వారికి న్యాయం చేయాలన్నారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌లోని పోలీస్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథ్ బాబు, సత్తెనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు, సత్తెనపల్లి రూరల్ సీఐ మీసాల రాంబాబు, సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల ఎస్‌ఐలు ఎం.సంధ్యారాణి, శశికుమార్, హజరతయ్య, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రత్యేక పిల్లలకు బోధించడం అదృష్టంగా భావించాలి

డీఈఓ వెంకటేశ్వర్లు



నరసరావుపేట ఈస్ట్: సాధారణ విద్యార్థులకు భిన్నంగా ఉండే ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మనస్సుతో విద్యా బోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. రావిపాడురోడ్డులోని పాఠశాలలో మంగళవారం జిల్లా సమీకృత విద్య ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించటం అదృష్టంగా భావించాలని తెలిపారు. ప్రత్యేక విద్య జిల్లా అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ ఆర్.సెల్వరాజు మాట్లాడుతూ, ప్రతి భవిత పాఠశాలలో 10 రికార్డులను తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఐఈడీ కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లాలోని భవిత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ.. దేశ రక్షణ

- ఎన్‌సీసీ వైపు విద్యార్థుల చూపు
- సోల్జర్ ఆఫ్ స్కూల్‌గా గుర్తింపు
- త్రివిధ దళాలలో శిక్షణ
- ఆర్మీలో రెండవ సైనిక్ శిక్షణగా పేరు
- గుంటూరు గ్రూపులో శిక్షణ పొందుతున్న 22వేల మంది క్యాడెట్లు
- ఎన్‌సీసీ శిక్షణతో విద్య, ఉద్యోగ అవకాశాలు సైతం..



డ్రిల్ చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు



ఫైరింగ్ చేస్తున్న క్యాడెట్

పిడుగురాళ్లరూరల్: సమాజానికి ఉత్తమ పౌరులను అందించటంలో కీలకపాత్ర పోషిస్తూ ఆర్మీలో రెండవ సైనిక్ శిక్షణ సంస్థగా నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) గుర్తింపు పొందింది. యువతను క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రముఖపాత్ర పోషిస్తూ భావితరం సైనికులుగా మారుస్తోంది. ఎన్నో విధాలుగా దేశానికి సేవలు అందించటంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వింగ్‌లతో కూడిన ట్రై సర్వీసెస్ ఆర్గనైజర్‌గా స్వచ్ఛందంగా పాఠశాల, కళాశాల శిక్షణ కోసం ఎన్‌సీసీని ఏర్పాటు చేశారు. విద్యార్థులను మానసికంగా, శారీరకంగా దృఢమైన పౌరులుగా మార్చి త్రివిధ దళాలలో చేరేలా ప్రోత్సహిస్తూ శిక్షణనిస్తుంది. అనుకోని విపత్తులు సంభవించినప్పుడు సహాయ, సహకారాలు అందించేందుకు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ సభ్యులు ముందుంటారు. దేశంలో మొత్తం 15 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లుగా శిక్షణ పొందుతున్నారు. దేశవ్యాప్తంగా పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో, మోడల్ స్కూళ్లల్లో ఎన్‌సీసీ శిక్షణను తప్పక నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

గుంటూరు గ్రూపులో 10 బెటాలియన్లు..

ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 25, ఆంధ్రా బెటాలియన్ పరిధిలో 45 జూనియర్ డివిజన్ యూనిట్లు, 13 సీనియర్ డివిజన్ యూనిట్లు నడుస్తున్నాయి. గుంటూరు గ్రూపు(గుంటూరు, ప్రకాశం, నెల్లూరు)లో 10 బెటాలియన్‌లు ఉన్నాయి. ఈ బెటాలియన్లలో మొత్తం 22,000 మంది విద్యార్థులు ఎన్‌సీసీ శిక్షణ పొందుతున్నారు. గుంటూరు గ్రూపులో పీఎం శ్రీ కింద 40 పాఠశాలలు ఎంపికయ్యాయి.

వివిధ రంగాల్లో శిక్షణ...

ఎన్‌సీసీలో త్రివిధ దళాల్లో శిక్షణ ఇస్తారు. డ్రిల్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, కంపాస్, సాంస్కృతిక కార్యక్రమాలు, గార్డ్ ఆఫ్ హానర్, ఫ్లాగ్ ఏరియా, జాతీయ సమగ్రత అవగాహన కార్యక్రమం, ఆబెస్టికల్స్, గుర్రపు స్వారీ, స్లిథరింగ్, తల్ సైనిక్ క్యాంప్, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలు, మోడలింగ్స్, యూత్ ఎక్స్‌ఛేంజ్ ప్రోగ్రాం, పర్వతారోహణ వంటి వివిధ విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఉంటుంది. ఎన్‌సీసీ విభాగంలో సర్టిఫికెట్లు మూడు విభాగాల్లో ఉంటాయి. 8,9,10 తరగతుల విద్యార్థులకు 'ఏ' సర్టిఫికెట్, ఇంటర్, డిగ్రీ చదివే వారికి 'బీ', 'సీ' సర్టిఫికెట్లు లభిస్తాయి. ఏ సర్టిఫికెట్‌కు 3 మార్కులు, బీ కి 5 మార్కులు, సీ సర్టిఫికెట్‌కు 7 మార్కులు ఉంటాయి.

ప్రయోజనాలు...

ఎన్‌సీసీ సర్టిఫికెట్ ద్వారా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుంది. ట్రిపుల్ ఐటీ, ఎంబీబీఎస్, ఇంజినీరింగ్, డైట్, బీఈడీ వంటి వివిధ కోర్సుల్లో ప్రవేశంతో పాటు ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్ ఉంటుంది. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో హోంగార్డు సెలెక్షన్‌లో అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఆర్మీ, నేవీలో, ఎయిర్ ఫోర్స్‌లో వీరికే ఎక్కువ అవకాశాలు ఉంటాయి. పల్నాడు ప్రాంతంలో ఎన్‌సీసీ శిక్షణ పొంది అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో, త్రివిధ దళాల్లో ఉద్యోగాలు సాధించారు. కొందరు క్లిష్టమైన పర్వతాలు అధిరోహించి, అంతర్జాతీయ పర్వతారోహకులుగా ఖ్యాతి గడించారు.

తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



విద్యార్థులు చిన్నతనం నుంచే సమాజ సేవలను కాంక్షిస్తూ, సమాజంపై బాధ్యత కలిగి, దేశంపై గౌరవం కలిగి ఉండేలా ఎన్‌సీసీ శిక్షణ ఇస్తుంది. తల్లిదండ్రులు అవగాహన పెంచుకుని తమ పిల్లలను ఎన్‌సీసీలో చేరే విధంగా ప్రోత్సహించాలి.
– సీఎస్ సిద్ధు, సీఓ, 25వ ఆంధ్రా బెటాలియన్

గర్వంగా ఉంది..



యువతకు ధైర్య సాహసాలు, న్యాయకత్వ లక్షణాలు అందిస్తూ, చిన్నతనం నుంచే దేశభక్తిని పెంచుతూ, సమాజ సేవలో పాలు పంచుకునే విధంగా ఎంతో మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లకు శిక్షణ ఇచ్చాను. ఈ రోజు వారు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో పేరు తెచ్చుకున్నారు. నాకు చాలా గర్వంగా ఉంది.
–ఆదూరి ఇమ్మానియేల్ రాజు, ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్

ఐపీఎస్ కావాలనేది నా జీవిత లక్ష్యం



ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్నాను. గుజరాత్‌లో జరిగిన క్యాంప్‌లో ఆల్ ఇండియా ట్రాకింగ్‌లో బెస్ట్ అవార్డు సాధించాను. ఫైరింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించాను. ఎన్‌సీసీ శిక్షణలోనే అన్నీ నేర్చారు. నేను ఐపీఎస్ కావాలనేది నా జీవిత లక్ష్యం. – వర్షా వెన్నెల, ఎన్‌సీసీ క్యాడెట్

రాష్ట్రపతి నుంచి మెడల్ అందుకున్నాను



ఎన్‌సీసీ శిక్షణ పొందుతూ రిపబ్లిక్ డే రోజు ఢిల్లీలో జరిగిన డ్రిల్‌లో కీబోర్డు ప్లేయర్‌గా సెలెక్ట్ అయ్యాను. రాష్ట్రపతి ముందు కీబోర్డు, ప్యాడ్ వాయించి మెడల్ అందుకున్నాను. ఇలా కీ బోర్డు, ప్యాడ్ వాయించటం ఎన్‌సీసీ శిక్షణలోనే నేర్చుకున్నాను.
– కిన్నెర బెన్‌హాన్, ఎన్‌సీసీ క్యాడెట్

జిల్లాలో 700 మినీ గోకులాలు

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కాంతారావు

నరసరావుపేట రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లాలో 700 మినీ గోకులాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కాంతారావు తెలిపారు. పెదచెరువులోని జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి మండలంలో 25 మినీ గోకులాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. పశువుల మినీ గోకులం యూనిట్ ఖర్చులో 90శాతం ఉపాధి హామీ పథకం నిధులు, 10శాతం లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుందన్నారు. రెండు, నాలుగు, ఆరు పశువులకు ఉపయోగపడే విధంగా షెడ్‌లను ఈ పథకంలో నిర్మించుకోవచ్చని తెలిపారు. గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్‌లు ఈ పథకంలో ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. ఈ షెడ్‌ల నిర్మాణానికి 70 శాతం ఉపాధి హామీ పథకం నిధులు, 30 శాతం లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డుతో పాటు సొంత స్థలం కలిగి ఉన్న రైతులు ఈ పథకంలో లబ్ధిపొందేందుకు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులతో పాటు దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 503.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,496, ఎడమ కాలువకు 2,872, ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- క్రోసూరు మండలంలోని పలు పాఠశాలల్లో తనిఖీ
- డెంగీపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓకు సూచన



విప్పర్ల ఎంపీపీ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

క్రోసూరు: విద్యార్థులు ఒకటి, రెండు రోజులు బడిమానితే దానికి కారణాన్ని ఉపాధ్యాయులు తప్పక తెలుసుకోవాలని, అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా తయారు చేయించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. క్రోసూరు మండలం విప్పర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, విపర్ల–2 అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూళ్లను మంగళవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్ అరుణ్‌బాబు మోనూ ప్రకారం భోజనం అందిస్తుందీ లేనిదీ పరిశీలించారు. భోజనం రుచిగా ఉందా.. లేదా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలోని స్టాక్ రూమును పరిశీలించి రిజిస్టర్ ప్రకారం స్టాకు ఉన్నదో లేదో పరిశీలించాలని తహసీల్దార్ ఎం.సువర్ణను ఆదేశించారు. ఆయనవెంట సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఉమారాణి, మండల విద్యాశాఖాధికారి గణేష్, పాఠశాల హెచ్‌ఎం ఇ.శ్యాంసన్, కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తం చేయండి ..

డెంగీపై వైద్యులను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు డీఎంహెచ్‌ఓ రవిని ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇన్నారావుతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు డయేరియా, డెంగీ, వంటివి ఏమైనా నమోదయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని స్టాక్ రూము, మందులు పంపిణీ చేసే గది, సిబ్బంది హాజరుపట్టిక తదితరాలను పరిశీలించారు. డెంగీపై వైద్య అధికారులను అప్రమత్తం చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. దీనిపై మరోసారి రివ్యూ చేద్దామని అన్నారు.

పత్తి సాగులో సస్యరక్షణ చేపట్టాలి

- ఏరువాక కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.నగేష్
- లింగారావుపాలెం, సొలస గ్రామాల్లో పత్తిపంట పరిశీలన



లింగారావుపాలెంలో పత్తి రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

యడ్లపాడు: వరుసగా కురిసిన వర్షాలకు పత్తిపొలాల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా ఏరువాక కేంద్రం ఇన్‌చార్జి కో–ఆర్డినేటర్ ఎం.నగేష్ సూచించారు. వర్షం నేపథ్యంలో పంటల పొలాల సందర్శనలో భాగంగా మంగళవారం శాస్త్రవేత్తల బృందం యడ్లపాడు మండలాన్ని సందర్శించింది. లింగారావుపాలెం, సొలస గ్రామాల పరిధిలోని దావల కోటయ్య, కట్టా హరిబాబుతో పాటు పలువురి ప్రత్తి పొలాలను బృందం పరిశీలించింది. ప్రస్తుతం జిల్లాలో 20 నుంచి 30 రోజుల వయస్సు కలిగిన మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం సస్యరక్షణపై తగు సలహాలు, సూచనలు చేశారు.

సత్వరమే చేపట్టాల్సిన చర్యలు...

కో–ఆర్డినేటర్ నగేష్ మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లోని ప్రత్తిపైరు ఎర్రబడటంతో మొక్కలు గిడసబారి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. దీని నివారణకు.. రైతులు 13:0:45 మల్టికే ఎకరాకు 2 కిలోలు చొప్పున 200 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకర్‌లో నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. 30 రోజుల తర్వాత ఒక బ్యాగ్ యూరియా డీఏపీ, 25 కేజీల పొటాష్ ఎకరాకు వేసుకోవాలి. అలాగే రసం పీల్చే మందు మోనోక్రోటోఫాస్ 1:4 నిష్పత్తిలో కాండం పూత ద్వారా నివారించుకోవచ్చని తెలిపారు. ఏరువాక శాస్త్రవేత్త ఎస్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ పిందె రాలకుండ ఉండేందుకు 45, 60, 80 రోజుల కాల వ్యవధిలో బోరాన్ లీటర్ నీటికి 1.5గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు. అందరూ తప్పనిసరిగా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని గులాబీరంగు పురుగు ఉధృతిని గమనిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏరువాక విస్తరణ శాస్త్రవేత్త ఎం.వెంకటరాములు మాట్లాడుతూ పత్తిలో స్వల్పకాలిక పెసర లేదా కొర్ర, మినుము రకాలను అంతర పంటలుగా వేసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి, నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత, గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ హజరాబీ, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

ఆగస్టు 10,11,12 తేదీల్లో వినుకొండలో చాంపియన్ షిప్ పోటీలు



క్రోసూరు: ఆగస్టు 10,11,12 తేదీల్లో వినుకొండలోని గుడ్‌షెపర్డ్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు మొత్తం 36 మందిని ఎంపికచేశామని ఉమ్మడి గుంటూరు జిల్లా క్రీడా అసోసియేషన్ సెక్రటరీ జి.శివపార్వతి తెలిపారు. మంగళవారం స్థానిక సెయింటాన్స్ పాఠశాలలో జరిగిన క్రీడాకారుల ఎంపికలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి మొత్తం 170 మంది హాజరుకాగా వారిలో బాలురు 18, బాలికలు 18 మంది మొత్తం 36 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ మేరీ రజిత, పీఈటీ మక్కెన వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పథకాలు

జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి



నరసరావుపేట రూరల్: ఉద్యాన పంటలను సాగుచేస్తున్న రైతుల ఆర్థికాభివృద్ధికి పలు పథకాలను అమలు చేస్తున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి మంగళవారం తెలిపారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ ద్వారా ఈ ఏడాది రూ.5.41కోటన్లు సబ్సిడీ ద్వారా రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. పండ్లతోటల విస్తరణ పథకంలో భాగంగా మామిడి, నిమ్మ, బత్తాయి, దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, జామూన్ తోటలు, హైబ్రిడ్ కూరగాయలు, పూల తోటలు సాగుకు సబ్సిడీపై అందజేయనున్నట్లు తెలిపారు. ఉద్యాన యాంత్రీకరణ కింద చిన్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్స్, తైవాన్ స్ప్రేయర్‌లను సబ్సిడి కింద మంజూరు చేస్తామని తెలిపారు. వివిధ పథకాలకు రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన ద్వారా రూ.61.30లక్షలను సబ్సిడీ ద్వారా అందజేస్తామని తెలిపారు. సాగుకు అనుకూలమైన మండలాల్లో రూ.68.64లక్షలను ప్రభుత్వం ఆర్థిక కేటాయింపు చేసినట్లు వివరించారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గం



నరసరావుపేట: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ పల్నాడు జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పాలేటి శ్రీనివాసరావు, నడింపల్లి సుబ్బారావు ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణంలోని అరండల్‌పేటలో గల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం.రామచంద్రరావు, జిల్లా కోశాధికారిగా వై.వెంకటేశ్వరరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా డి.ఆరోన్‌రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఎ.అనంతమ్మతో పాటు మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి తల్లపునేని రామారావు, ఉపాధ్యక్షులు మొక్కపాటి రాంబాబు వ్యవహరించారు.